### నాడు నీళ్లకు గోసయ్యేది

అప్పట్లో కాలువల్లో నీళ్లు సరిగా రాక పంట వేసుకునేందుకు గోసయ్యేది. వారబందీలో నీళ్లివ్వడంతో పంటలు దెబ్బతినేవి. కొంచెం నీళ్లు ఎక్కువగా వదిలిపెడితే కట్ట తెగిపోయేది. దీంతో రోజుల కొద్దీ నీళ్లురాక పంటలు ఎండిపోయేవి. తెలంగాణ రాకముందు సాగు నీళ్ల కోసం రూ.3లక్షలు పెట్టి బావి లోతు తవ్విస్తే అప్పులైనయ్.. ఇప్పుడు సాగు నీళ్లకు రందీ లేదు. పుష్కలంగా నీళ్లు వస్తుండడంతో పంటలు మంచిగ పండుతున్నయ్.

*- గూడూరి ప్రభాకర్‌రెడ్డి, రైతు (రంగాపూర్)*



పంట పొలంలో రైతు ప్రభాకర్‌రెడ్డి

# నిండుగా ‘కాకతీయ’..

- స్వరాష్ట్రంలో కాలువలకు మహర్దశ
- చివరి ఆయకట్టుకూ పుష్కలంగా నీళ్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



నీటి ప్రవాహంతో కళ కళ లాడుతున్న కాకతీయ కాలువ (ఫైల్)

ప్రత్యేక రాష్ట్రంలో కాకతీయ కాలువకు మహర్దశ వచ్చింది. నాడు సీమాంధ్ర పాలకుల నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరుకున్న కాలువ నేడు నిండుగా పారుతూ పంటలకు జీవం పోస్తున్నది. శ్రీరాంసాగర్ పునర్జీవ పథకంలో భాగంగా శిథిలావస్థలో ఉన్న కాకతీయ కాలువలను బీఆర్ఎస్ ప్రభుత్వం పటిష్టపరచడంతో తమకు ఎంతో మేలు జరుగుతున్నదని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నది.

*-హుజూరాబాద్, నవంబర్ 11*

నాలుగేండ్ల క్రితం కాలువలు, డిస్ట్రిబ్యూటర్లు, యూటీలకు మరమ్మతులు చేపట్టారు. కట్టను విస్తరించడంతోపాటు, ఎత్తు పెంచడం, లైనింగ్ పనులు చేశారు. దీంతో 7500 క్యూసెక్కుల నీళ్లు విడుదల చేసినా ఎక్కడా కూడా తెగిపోకుండా కాలువ నిండుగా ప్రవహిస్తున్నది. కాలువ ఎత్తును ఇరువైపులా సగం మీటరు ఎత్తు పెంచగా, కుడి కట్ట గతంలో 7మీటర్లు ఉండగా, ప్రస్తుతం 8.5మీటర్లకు పెంచారు. అదే విధంగా ఎడమ కట్ట 5మీటర్లు ఉండగా, 7మీటర్ల వరకు పెంచారు. అయితే అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో పూర్తి స్థాయిలో నీళ్లు విడుదల చేయడం సాధ్యం కాకపోయేది. పూర్తి స్థాయిలో ఆయకట్టు స్థిరీకరించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేయగా.. మరమ్మతులు చేపట్టినప్పటి నుంచి చివరి ఆయకట్టు వరకు సాగు నీళ్లు సాఫీగా వెళ్తుండడంతో రైతులు సంతోషంలో ఉన్నారు.

### ఇప్పుడు నీటికి ఢోకాలేదు



ఎప్పుడో దశాబ్దాల కాలం తవ్విన కాకతీయ కాలువలు దెబ్బతిన్నా సీమాంధ్ర పాలకులు పట్టించుకోలేదు. నాడు అంతంతగానే నీళ్లు రావడంతో పంటల సాగుకు ఇబ్బంది ఉండేది. బీఆర్ఎస్ సర్కారు కాలువలు మరమ్మతు చేయించిన నాటి నుంచి నీటికి ఢోకాలేదు. కేవలం ఒక్క హుజూరాబాద్ మండల పరిధిలోని కాలువలను పటిష్టపరిచేందుకు సర్కారు రూ.25కోట్లు వెచ్చించడం హర్షణీయం.

*-ఎడవెల్లి కొండల్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్(సిర్సపల్లి)*



బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన లైనింగ్ పనులు (ఫైల్)

## బీజే నియోజకవర్గ కన్వీనర్‌గా సంతోష్‌కుమార్



సంతోష్‌కుమార్‌యాదవ్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్11: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని దమ్మక్కపేట గ్రామానికి చెందిన కూకట్ల సంతోష్‌కుమార్ యాదవ్‌ను భారత్ జాగృతి హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తూ తెలంగాణ చరిత్ర, విద్యార్థి, యువత, మహిళా సాధికార అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో భారత్ జాగృతిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన భారత్ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు నవీన్‌ఆచారి, రాష్ట్ర కార్యదర్శి బాలసంకుల అనంతరావు, పీఆర్‌వో గాలిపెల్లి రత్నాకర్, యూత్ జిల్లా అధ్యక్షుడు ఉయ్యాల విష్ణువర్ధన్‌కు సంతోష్‌కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలో నగదు పట్టివేత



సీజ్ చేసిన నగదుతో ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ రమేష్, ఎస్‌ఎస్‌టీ టీం సభ్యులు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 11: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి పరకాల క్రాస్ రోడ్‌లోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టీ టీం పోలీసుల తనిఖీల్లో రూ. లక్షా 2,500 నగదు పట్టుబడింది. శనివారం హనుమకొండకు చెందిన నితీశ్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా సదరు నగదు తరలిస్తుండగా, పట్టుకొని సీజ్ చేసినట్లు ఏసీపీ ఎల్ జీవన్‌రెడ్డి శనివారం తెలిపారు. సీజ్ చేసిన నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీకి డిపాజిట్ చేసినట్లు ఎస్ఎస్‌టీ ఇన్‌చార్జి తెలిపారు. ఈ వాహన తనిఖీలో టౌన్ సీఐ బొల్లం రమేశ్, ఎస్ఐ సాంబయ్య, పోలీస్ సిబ్బంది, ఎస్ఎస్‌టీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల విద్యాలయంలో ప్రతిభాపోటీలు




విజేతగా నిలిచిన రిత్విక్‌కు నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జీ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 11: పట్టణంలోని వీణవంక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు) విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు శనివారం ‘మీలో ఎవరు వెయ్యి రూపాయల విజేత’ కార్యక్రమాన్ని నిర్వహించగా, విద్యార్థుల నుంచి చక్కని స్పందన లభించిందని ప్రిన్సిపాల్ జీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమం టీవీలో నిర్వహించే ‘మీలో ఎవరు కోటీశ్వరులు’ కార్యక్రమం నమూనాలో రూపొందించిన ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాన్ని మూడు రౌండ్లలో నిర్వహించగా, చివరి రౌండులో విజేతగా పదో తరగతి చదువుతున్న రిత్విక్ రూ.1000 బహుమతి గెలుచుకున్నాడు. విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ నరేశ్, డిప్యూటీ వార్డెన్ శ్వేత, ఉదయ్, రమ, సరితా బాయ్, లైబ్రేరియన్ కిశోర్, ఓంకార్, రమేశ్, మహేశ్, సర్దార్, అశోక్, సురేశ్, శ్రీనాథ్, ప్రశాంత్ సుమలత, రేణుక, పవనజాక్షి, మంజుష, నిఖిల, ప్రదీప్, పీఈటీ భరత్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా విస్తృత ప్రచారం

### ప్రజలకు బీఆర్ఎస్ పథకాలు వివరించి ఓటు అభ్యర్థించిన గులాబీ శ్రేణులు



27వ వార్డులో బీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 11: హుజూరాబాద్ 27వ వార్డులోని కోతిబొమ్మ ఏరియాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శనివారం వాడవాడలా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులు, తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకువెళ్లారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయాలని, కౌశిక్‌రెడ్డిని గెలిపించి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని కోరారు. కారు గుర్తుకు ఓటేస్తే పట్టణాన్ని గొప్పగా తీర్చిదిద్దుకుందామని స్థానిక కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు మూశం మార్కండేయ, 3వ వార్డు కౌన్సిలర్ మక్కపెల్లి కుమార్‌యాదవ్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఇసాక్, నాయకులు జీ అనిల్‌కుమార్, చక్రపాణి, టీ తిరుపతి, లింగయ్య తదితర నాయకులు వార్డులోని పార్టీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

## కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం కాళేశ్వరంలో పూజలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్11: హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలువాలని కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో శనివారం ముదిరాజ్ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలు, నిరుపేదల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెచ్చిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్లు కూడా రావన్నారు. ముక్కంటి దయతో కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మకుండా ప్రజా రంజక పాలన చేస్తున్న బీఆర్ఎస్‌ను ఆదరించాలని సమ్మయ్య కోరారు.



కాళేశ్వరం ఆలయంలో బీఆర్ఎస్ కరపత్రంతో సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్